

# ఇదీ ఓ ప్రేమకథే

కొలికపూడి శరత్ బాబు





గతానికి రూపం ఉంటే అది విషాదం.

వర్తమానాన్ని అద్దంలో చూస్తే వికారం....

భవిష్యత్తును భూతద్దంలో చూసుకుంటే భయంకరం...

భయంకరమైన విషాదాన్ని తలచుకుంటే వికారంగా బ్రతకటమే జీవితమా?

అదే జీవితమైతే, నేను శ్వాసించేది ఆ బ్రతుకు కోసమే అయితే ....

మై లెఫ్ట్ ఫూట్ .... అలాటి బ్రతుకుకన్నా చావటం నయం..



సహజమైన చావుకాదు .... అంత అదృష్టం కూడానా?!

చావుకూడా అదృష్టం అనుకొనే రోజులు వచ్చేశాయి బాబోయ్... వచ్చేశాయ్

ఇంతకన్నా దురదృష్టం ఇంకోటి లేదు గాక లేదు.

ఆత్మహత్య మహాపాపం అన్న ఫిలాసఫర్ ఎవడోగాని నా ముందుకొస్తే...

సైనేడ్ కలిపిన విస్కీ చేతికిచ్చి తాగమని రివాల్వర్ గురిపెడతాను.

చచ్చి బ్రతికిపోతాడు...బ్రతికితే చంపేస్తాను..

బయట హీరో హోండా స్టార్టయిన శబ్దం వినిపిస్తోంది. వాల్‌క్లాక్ చూశాను. ఎనిమిది కింకా ఐదు నిమిషాలు.

సరిగ్గా ఇదే టైమ్‌కి రోజూ సుస్మిత మొగుడితో కలిసి ఎక్కడికి వెళ్తుంది.

• ఎక్కడికి వెళ్తుంది?! హోటల్‌కా... సినిమాకా... షికారుకా?....

"ఎక్కడికెళ్తే నీ కెందుకురా ఇడియట్.... నీ పనేదో నువ్వు చూసుకోక ... ఎదురుగా టీపాయ్ మీద ఓల్డ్ మంక్ చిరాకుపడుతుంటే ..... సగం ఖాళీచేసి సిగరెట్ వెలిగించుకొని రిలాక్సింగా సోఫాలో జారిగిలబడి కళ్లు మూసుకుంటే .....

ఎంత హాయి .... ఎంత హాయి ఈ రేయి ... ఎంత మధుర మీ హాయి .... దొంగిలించిన రొట్టెముక్క బహుతీపి. అందుకే ఫ్రెండుకి అయిదొంద లిచ్చి అయిదు రోజులు నిరీక్షించగా....... నిరీక్షించగా.... ఈరోజు ఫుల్‌బాటిల్ తెచ్చిచ్చాడు. నాలుగు నెలల విరహం... అందునా దొంగ తనంగా తాగటం ఎంత గొప్పగా ఉంది. ఎంత



అద్భుతంగా ఉందనీ !!

బాల్కనీలోంచి చూస్తే బ్లూ ఫాక్స్ కనిపిస్తోంది. శిథిలమైన ఓనాటి అపురూపమైన చరిత్రకు నిదర్శనంలా..!

అవును మరి.

ఒకప్పుడు బయర్ ఖయ్యా, సాఖీలతో కళకళలాడిన రసవేదిక ఈరోజు కళా, విహీనంగా విలవిల్లాడుతున్నట్లు కనిపిస్తుంటే....గుండె తరుక్కుపోతోంది. అష్టదిగ్గజాలతో కల కళా వైభవంగా వెలుగొందిన ఆనాటి భువన విజయంలో ఈరోజు పిక్నిక్ కొచ్చి చీట్ల పేకాడుతున్న కాలేజీ కుర్రాళ్లలా... బ్లూఫాక్స్ లో ఇప్పుడు కాఫీ తాగేవారిని చూస్తుంటే చిరకాని పిస్తుంది.

అస్సలే ఆలోచిస్తున్నాను నేను...? ఎక్కడినుండి ఎక్కడి కొచ్చాను?!

తల్లి గర్భంనుండి హిమాయత్‌నగర్ పల్లవీ అపార్టు మెంట్స్ ఫ్లాట్ నెంబర్ నూట తొంభైలో మందు కొడుతున్నాను.

తల విదిలించాను. అదేంట్రా బాబూ ... మూడో పెగ్గుకే తల్లి గర్భం వరకు వెళ్లిపోయావు. ఆరుపెగ్గులు తాగి అరవిందను అంబాసిడర్లో ప్రక్కన కూర్చోబెట్టుకుని ఎనభైలో డ్రైవ్ చేసుకుంటూ ఆరోనెంబరు వీధి కొచ్చేవాడివి కదూ..... మరిప్పుడేమైంది... మూడో పెగ్గుకే అవుట్..... నయం....డకౌట్ కాలేదు.... సంతోషించు!!

గ్లాసు నందుకుని సిప్‌చేసి మరో సిగరెట్ వెలిగిస్తుంటే....

"సిగరెట్ వెలిగించేటప్పుడు నన్ను గుర్తుతెచ్చుకో కృష్ణా...... సిగరెట్ తాగాలని పించదు...."

అని ఉత్తరాలు రాసే వైశాలిని గుర్తొచ్చింది.

సిగరెట్ అర్పేయాలనిపించినా ఇది లాస్ట్ అను కుంటూ.... గుండెలోకి స్టేట్ ఎక్స్‌ప్రెస్ పొగను పంపిస్తూ నవ్వుకున్నాను.

వికారమైన వర్తమానంలో ఈ మాత్రం మనిషి ఆకారంలో కనిపిస్తున్నాను అంటే కారణం... వైశాలి.

అరవింద గుండెలోతు గాయంచేసి వెళ్లిపోతే ఆ గాయాన్ని ప్రేమనే బాండేజీతో మాన్పించిన వైశాలిని ఏమనాలి? దేవత అననా? ఊహు ... ! దేవతల్లో కూడా స్వార్థం ఉంటుందేమో...

అయినా నాలో ఏం చూసి ప్రేమించావు వైశాలి...?

చూడటానికి అసలు నేనెలా ఉంటానో తెలిస్తేగా ... అలాగే వైశాలి ఎలా ఉంటుందో నేను చూస్తేగా ...

ఏదో పత్రికలో కథ రాస్తే ..... ఆ కథ చాలా బాగుందని వైశాలి ఉత్తరం రాస్తే ఆ ఉత్తరం పత్రికవాళ్లు నాకు పంపిస్తే నేను థాంక్స్ చెబుతూ ఫార్మాలిటీ ఉత్తరం రాస్తే ... ఆ థాంక్సుకు థాంక్స్ చెబుతూ ఆమె రాస్తే.... ఇదిగో ... ఇలా విచిత్రమైన పరిచయం .... "సిగరెట్లు మానేయ్ కృష్ణా" అనేంత వరకు వచ్చింది.

దీన్ని నేను ప్రేమ అనను.... ప్రేమంటే వంచన..... ప్రేమంటే స్వార్థం.... ప్రేమంటే దగా.....

అరవిందకు ప్రేమించడం తెలుసు... అందుకే వంచించి స్వార్థంతో దగా చేయడంలో స్పెషలిస్ట్ !!

ఎంతైనా గైనకాలజిస్టు కదా... అందుకే అమెరికాలో ఉన్న హార్ట్‌స్పెషలిస్ట్‌ను చేసుకొని అమెరికా ఎగిరిపోయింది.

గైనకాలజీకి కార్డియాలజీకి ఏం సంబంధమో... ఏనాటి బంధమో.... నా కిప్పటికీ అర్థంకాదు !

ఆ గుండె గాయం మానటానికి వైశాలిచేసిన సహాయం.... జీవితంలో మర్చిపోలేను గాక మర్చిపోలేను.

కింద హీరో హోండా చప్పుడైతే ఆశ్చర్యంగా చూశాను, సుస్మిత ఇప్పుడు వెళ్తోంది. అంటే ఇందాక వెళ్లింది అమె కాదన్నమాట... అదేవి టీరోజు ఇంత ఆలస్యంగా వెళ్తోంది? మొగుడికి జీన్స్ పాంట్ ఇస్త్రీ చేసిచ్చే సరికి ఆలస్యమై ఉంటుంది. ఆ మానవుడు జీన్స్ తప్ప వేరే పాంటులు వేయడం నేనింత వరకు చూడలేదు.

అది అతని తప్పు అయి ఉండదు... పాపం అతనిలో ఉన్న జీన్స్ అలాటివి పాపం! బైక్ గేటు దాటుతూంది. ఊపిరి బిగపట్టాను. క్షణాలు గడుస్తున్నాయి.

ఒకటి.... రెండు ... మూ....

అదిగో ... సుస్మిత నన్నుచూసి నవ్వింది !!

అదే నవ్వు ... ప్రతిరోజూ నవ్వే నవ్వు ... ఆ నవ్వు కర్థం ఏమిటి ?

నవ్వుకు అర్థం లవ్వే అనుకొనే వయసు కాదు నాది ... అయినా నా పిచ్చిగానీ వయసును బట్టి అర్థాలు మారతాయా?

రేపు గౌరీ వస్తే సుస్మిత మొగు డేం చేస్తాడో అడగాలి.

"గౌరమ్మా... నీ మొగు డెవరమ్మా...?

గౌరీ గిన్నెలు తోముతున్నప్పుడు నే నా పాట పాడు తుంటే నవ్వుతూ కోపంగా ఎలా చూస్తుందనీ... ఆ కోపం వెనుక లీలగా ఆహ్వానం కనిపిస్తుంటుంది. అలాంటి నవ్వు నవ్వటం ఒక్క గౌరికీ చేతనవునేమో....!

అయినా ఇదేం పాడుబుద్ధి నాకు... అయిదు నెలల తర్వాత ఓల్డ్‌మంక్ తాగుతూ పనిమనిషి గూర్చి ఆలోచిస్తున్నా నేమిటి? ఓల్డ్ మంక్‌కి ద్రోహం చేసినట్టు కాదా? అవమాన పరిచినట్టు కాదా? అయితే ఏం ఆలోచించాలి? ఈ ముసలి సన్నాసిగాడి పరువుదక్కేలా ఆలోచించాల్సిన విషయం... ఏంటి?

వైశాలిని పెళ్లి చేసుకోవాలి!!

ఇది వరకు ఈ సబ్జక్టే ఆలోచిస్తుంటే.... కాఫీలూ టీలూ తాగుతూ కాదు. ఓల్డ్ మంక్ తాగుతూ నిర్ణయించు కోవాల్సిన విషయాన్ని ఇంత చీప్‌గా ఆలోచించాలా అని వాయిదా వేసేవాడిని... ఇప్పుడు ఆలోచించాలంటే... ఏదోలా ఉంది.

ఏదోలా ఎందుకు ఉంది?

గ్లాసు ఖాళీ అయింది. ఐస్ క్యూబ్స్ లేవు. ఫ్రిజ్ దగ్గర ఐస్ తీసుకుని వస్తుండగా... కరెంట్ పోయింది.

కరెంటు కోత- నీటి కోత.

రమ్ కోత- కడుపు కోత.... కాదు... గుండె కోత.

లైటర్ వెలిగించి.. సోఫాలో కూర్చుని.. గ్లాసులో రమ్ పోసుకుని ...ఐస్ వేసుకుని సిప్‌చేసి కళ్లు మూసుకుంటే...

చీకటి .... చీకటి .... చీకటి...

కళ్లు మూసినా .... తెరిచినా ... ఒక్కటే చీకటి...

ఆకాశం ఫెళ్లున ఉరిమింది. కిటికీలోంచి బయటకు చూశాను.

అప్పటివరకూ నక్షత్రాలలో మెరిసిపోతూ ఒకనాటి బ్లూఫాక్స్‌లా ఉన్న ఆకాశం దట్టంగా మేఘాలు కమ్మి ఈ రోజిలా దిగులుగా కనిపించింది.

వర్షం వస్తుందేమో ...?!

రానీ.... నాకేం... టూ బెడ్రూం డీలక్స్ ఫ్లాట్ లో ఉన్నాను. పాపం సుస్మిత తడిసి పోతుందేమో... తడవనీ... నాకేం... మొగుడికి లేని బాధ నాకేల?

వర్షంలో తడిసిన సుస్మిత ఎలా ఉంటుంది?

చిరాగ్గా సిగరెట్ వెలిగించాను. ఎలా ఉంటే నాకెందుకు? అయినా సుస్మిత గుర్చి ఎందుకాలోచిస్తున్నాను నేను?

ఆమె పరాధీన!

వామ్మో.... పెళ్లయిన ఆడది అంటే చాలదా? ఎందుకంత బరువైన పదం?

మరి ఓల్డ్ మంకా? మజాకా?!

సుస్మిత నన్నుచూసి ఎందుకు నవ్వుతుంది?

ఇంత వయసొచ్చినా ... ముదిరిపోయిన బెండకాయలా ఒంటరిగా ఉంటున్నందుకేమో...

నే నెలా ఉంటే ఆమె కెందుకు ? ఛ - అదేం మాట.. ఎంతైనా నైబర్ కదా....

లవ్ దై నైబర్ అన్నారు పెద్దలు .....

అదిగో మళ్లీ సుస్మిత.... వద్దురా బాబూ వద్దు .. ఓల్డ్ మంక్ గారికి కోపం వస్తుంది. సుస్మితను మర్చిపో.. అయితే ఏం ఆలోచిస్తున్నాను...? యస్... వైశాలిని పెళ్లి చేసుకోవాలి.

వైశాలి ఎలా ఉంటుంది?

ఉత్తరాలలో తన అక్షరాలలా గుండ్రంగా... పొందిగ్గా ... అందంగా ఉంటుందా?

ఆమె రాసే పదాలంత ఆత్మీయంగా ఉంటుందా?

అసలు నాకేం కావాలి? మనసా? అందమా? మనసే అయితే వైశాలిని కళ్లు మూసుకుని చేసుకోవచ్చు.

అందం ఎందుకు కొరుక్కు తిననా?!

ఆరు లక్షల కట్నంతో ఆముదాల వలస సంబంధం వస్తే... అరవింద మైకంలో అమ్మాయి నచ్చలేదని చెబితే. అమ్మ అనినమాట గుర్తొచ్చింది. అవును అందం ఎందుకు ... కొరుక్కు తిననా?!

అరవింద అందగత్తే .. ఏం చేశాను?

అమ్మో... ఒళ్లంతా ఒకటే పులకరింతల్రా నాయనా... ఏం చేశా నేం చేశా నేం చేశా...

అబ్బ ఏంటి బాబూ...ఇలా కొరుక్కు తింటూ.... చంపుతావేం....?

మురిపెంగా అనే అరవింద గుర్తొచ్చింది.

నిజమే. అందం కొరుక్కు తినటానికే పనికొస్తుంది. పెళ్లి చేసుకోటానికి ఉపయోగపడదు!

అందుకే వైశాలి ఎలా ఉన్నా చేసుకోవాలి.

ఈ ఒంటరి జీవితం నావల్ల కాదు బాబూ... ముప్పై అయిదు నిండాయి.. ఎందుకు అదిగో ఎదురుగా కనిపిస్తున్న చెట్టుకీ. చెట్టుకింద రాయికీ ఉంటాయి వంద ఏళ్లు.

అర్జంటుగా పెళ్లి చేసుకోవాలి! లేకపోతే సుస్మిత లాంటి పరాధీనల గుర్చి ఆలోచిస్తూ మనసు పాడుచేసుకుంటున్నాను. పెళ్లికి సుస్మితను పిలిచి ...


ఇక నవ్వకండి ... పెళ్లి చేసుకుంటున్నాగా.... అనాలి ఏముంటుందో

ఆమె సరే ...! జీన్స్ మొగుడు ఏమంటాడో ... ఏమయినా అంటే జీన్‌పాల్ సాత్రేను చించమంటాను.

అయినా వాడేంటి. తెల్లగా మారకముందు మైకల్ జాక్సన్‌లా ఉంటాడు

చుడీదార్ వేస్తే జానెట్ జాన్సన్‌లా ఉంటాడేమో. అన్నట్టు ఇప్పుడు మైకల్ జాక్సన్ కన్నా జానెట్ జాన్సన్‌కి పాపులార్టీ బాగుందట. అన్నను మించిన చెల్లెలన్న మాట. ఏం ఫిగర్ బాసూ...! ఏం ఫిజిక్కు... లాజిక్కులు వెదకాల్సిన అవసరం లేని ఫిజిక్....

అదుగో మళ్లీ పరాయి స్త్రీల గుర్చి ఆలోచిస్తున్నాను.




నాలుగో పెగ్గుకే ఈ దేశం వదిలి అమెరికా ఆడవాళ్ల గురించి ఆలోచిస్తున్నానంటే ..... ఓల్డ్ మంక్ నెత్తికెక్కాడన్న మాట.

వర్షం ప్రారంభమైంది

వానదేవుడా... నీకు నా కృతజ్ఞతలు. ఇలా మందు కొడుతున్నప్పుడు వర్షం వస్తే నాకు చాలా.. చాలా.. ఇష్టమని తెలుసుకుని నన్ను కరుణించావా స్వామీ. రేపే నీ గుడికొచ్చి పాతిక కొబ్బరికాయలు కొడతాను. వానదేవుడికి గుడి ఉందా, లేదా?

రేపు గౌరీని అడగాలి. ఇలాటి దేవుళ్ల వివరాలు తెలుసుకోటానికి గౌరి ఓ ఎన్‌సైక్లోపీడియా!

"గౌరమ్మా నీ మొగుడెవరమ్మా...."

అదుగో మళ్లీపరాయిస్త్రీ.... ఏడిశావ్‌లేవోయ్ పరాయి స్త్రీ అంటున్నావ్ నీ కంటూ స్వంత స్త్రీ ఉన్నట్టు పెద్ద పోజు. అంతరాత్మ కసిరింది.

మనిషి మందుకొడితే అంతరాత్మకు కిక్కెక్కుతుందా? లేకపోతే ఎంతమాట అంది? నాకంటూ స్వంత స్త్రీ లేదా? అయితే వైశాలి ఎవరు? నా స్వంతం కాదా?

లాభం లేదు. రేపే ఉత్తరం రాసి చెప్పేయాలి.

"వైశాలి డియర్... నువ్వు అడిగినట్టు ... నేను నిన్ను పెళ్లి చేసుకోటానికి రెడీ. పెళ్లి ఇక్కడ చేసుకుంటేనే మంచిది. సుస్మితను, గౌరీని అందరినీ పిలవచ్చు. అరవింద క్కూడా ఉత్తరం రాసి ... పెళ్లి ఫొటో పంపించి ... వైశాలి నెలతప్పితే నువ్వే టెస్ట్ చేయాలి అని రాయాలి.

టిట్ ఫర్ టాట్ .... అంతే !

గ్లాసు ఖాళీ అయింది. బయట వర్షం పెద్దదయింది... ఉరుములు...మెరుపులు. ఓహ్ అద్భుతమైన వాతావరణం. ఈ కరెంటు రాకుండా ఇలాగే ఉంటే బాగుండు. చీకటికి ఎంత సౌందర్యం ?!

అయిదో పెగ్‌ఫిక్స్ చేసుకుంటున్నప్పుడు .... అప్పుడు తలుపు చప్పుడైంది!!

ఉలిక్కిపడ్డాను. ఈ వేళప్పుడు నా దగ్గరకు ఎవరూ రారు. అయితే తలుపు చప్పుడు చేస్తుందెవరో ?

సుస్మిత?

వైశాలి ?

గౌరీ ?

లేక...పో....లీ...సు...లా?.. వాసన పట్టేశారా?

మళ్లీ చప్పుడైంది. గ్లాసు, బాటిల్ వగైరాలు సర్దే ఓపికలేక ... అలాగే ఉంచి, తలుపు దగ్గరకెళ్లి - తలుపు తీశాను.

చీర మాత్రమే కనిపిస్తోంది.

"ఎవరు?" అన్నాను.

"లోపలికి రావచ్చా?" నవ్వుతూ అంది.

ఎవర్రా బాబూ ఈ చీకట్లో - ఈ వర్షంలో.... ఈ వేళప్పుడు తలుపు కొట్టి లోపలికొస్తానంటుంది -ఎవరీ పరస్త్రీ ?!

"సారీ - రండి లోపలికి .." అని ప్రక్కకు తప్పుకున్నాను.

గాజుల చప్పుడుతో చీర పెరపెరలు కలిపి... లోపలి

కొచ్చింది.

"కొవ్వొత్తి లేదా ?" అడిగింది.

"లేదు - ఉంది - బ..ట్.." కంగారుగా అంటూ లైట్ వెలిగించి... చూశాను.

ఆకాశం భయంకరంగా ఉరిమింది. గాలి విసురుగా వచ్చి కిటికీ తలుపును తాకింది.

"ను...వ్వా..?" నా పెదవులు మాత్రమే పలికాయి. స్వరం బయటకు రాలేదు.

అరవింద నవ్వింది !

"అవును. ఎందు కలా ఆశ్చర్యపోతున్నావ్... ఏంటీ ... మందు కొడుతున్నావా ?" అంది.

"అదేంటి ? అమెరికా నుంచి ఎప్పు డొచ్చావ్?" ఇంకా తేరుకోకుండా అడిగాను.

"చెపుతా గానీ ... కొవ్వొత్తి వెలిగించు బాబూ. ఇలా చీకట్లో ఏంటి?" నవ్వుతూ అంది.

నేను కొవ్వొత్తి కోసం వెళ్ళే లోగానే... కరెంట్ వచ్చేసింది.

"థాంక్ గాడ్" అంటూ సోఫాలో కూర్చుంది అరవింద.

నేను ఆమెనే చూస్తున్నాను.




పెద్ద మార్పేమీ లేదుగానీ... మనిషిలో ఆదోళకమైన హుందాతనం ... డిగ్నిటీ ... గ్రేస్... కనిపిస్తున్నాయి. బాగా రంగుతేలి ... కొంచెం లావయి... నిగారిస్తుంది.

"ఏంటి ఈ రోజంతా ఆశ్చర్యపోతూ ఉంటావా?" అంది చిరుకోపంతో.

నేను నవ్వి ఆమె కెదురుగా సోఫాలో కూర్చుని గ్లాసు అందుకొని -

"సారీ.. లేచే ఓపిక లేదు. వెళ్లి గ్లాసు తెచ్చుకో.." అన్నా.

"నో.. థాంక్స్.. పెళ్లయ్యాక అన్నీ మానేశాను" అంది.

నేను మాట్లాడలేదు. సిగరెట్ వెలిగించాను.

"ఈ రోజు ఉదయమే వచ్చాను. ఇద్దరం కలిసి వద్దామంటే .. ఆయనకు లీవ్ దొరకలేదు... అందుకే ... నే నొక్కదాన్నే వచ్చేశాను ... " అంది.

"ఏంటి విశేషం?" అడిగాను.

"నీ కోసమే..." అంది నవ్వుతూ.

"అని మీ ఆయనకు చెప్పి వచ్చావా?" అన్నా.

ఆమె ముఖం మీద క్షణ కాలం నవ్వు మాయమై ... మ్లానమై...అంతలోనే నవ్వేస్తూ..

"ఆ..హా... చెప్పే వచ్చాను" అంది.

"అయితే చెప్పు... ఏంటి విశేషం?" అన్నా.

ఏమిటో... అరవిందను చూసేసరికి నెత్తికెక్కిన ఓల్డ్ మంక్ కిందికి దూకి మాయమైపోయిన ట్లనిపించింది.

అరవింద అరగంట సేపు అమెరికా విశేషాలు చెప్పి ... ఆ తర్వాత అడిగింది.

"ఏమిటి కృష్ణా... పెళ్లి చేసుకోవా ? ఇంకా నన్ను మర్చిపోకుండా ఇలాగే ఉండిపోతావా?"

నవ్వాను నేను...

అరగంట నుంచీ నేను ఎదురు చూసిన సన్నివేశం ఇదే... గ్లాసందుకొని సిప్ చేసి అన్నాను..

"ఇలాగే ఎందు కుండి పోతాను అరవిందా? అంత పిచ్చివాడిలా కనిపిస్తున్నానా? .. ఆనాటి ని న్నెప్పుడో మర్చిపోయాను నేను. ప్రపంచంలో ఆడది అంటే అరవిందే కాదు. నీకన్నా అందమైన వాళ్లు.. తెలివైనవాళ్లు చాలామం దున్నారు. ఎలాగూ ఓ నెలరోజులు ఉంటానని చెపుతున్నావుగా... నా పెళ్లి కూడా చూసి వెళ్లు."

అరవింద ఆశ్చర్యంగా చూసింది.

నా కా చూపులో జెలసీ, రవ్వంత కోపం కనిపించాయి.

"అలాగా... కంగ్రాచ్యులేషన్స్. ఇంతకీ ఎవ రా అదృష్టవంతురాలు? " అంది అసూయగా నవ్వుతూ.

"గైనకాలజిస్ట్ మాత్రం కాదు." అన్నాను కసిగా నవ్వుతూ.

"పోనీ కార్డియాలజిస్టా?" అంది ఏడ్వలేక నవ్వుతూ.

"కాదు. వైశాలి అని నా అభిమాని. నేనంటే ప్రాణం. ఎంత అందంగా ఉంటుందో తెలుసా? ఈ సోకాల్డ్ బ్యూటీలంతా ఆమె కాలి గోటికి పనికి రారు" అన్నాను.

"అలాగా.... అయితే మంచిదే..." అంది హీన స్వరంతో.

నేను మరింత విజృంభించి వైశాలి తెలివి తేటలు..అందం.. ప్రేమ వగైరాల గూర్చి చెబుతుంటే భరించలేని దానిలా లేచి నిలబడి..

"ఇక వెళ్లొస్తాను కృష్ణా... ఇప్పటికే ఆలస్యమైంది" అంది.

"అలాగే ... ఇంటివరకు డ్రాప్ చేయనా?" అన్నాను లేచి నిలబడుతూ.

"నో థాంక్స్... డ్రైవరున్నాడు" అంది.

"పెళ్లికి రావడం మర్చిపోకు" అన్నా నవ్వుతూ.

"తప్పకుండా వస్తాను... సరేనా?" అంది .. గుమ్మం వరకూ వెళ్లి ఆగి .. వెనక్కు తిరిగి చూసి - "ఒక్క విషయం చెప్పనా?" అంది.

"ఏమిటి?" అన్నాను.

"మనసు గాయపడితే... మానటానికి మరో మనసు తోడు అవసరం... నా వల్ల నీ మనసుకు అయిన గాయం మానటానికి వైశాలి సహకరించిం దన్నమాట" అంది.

"అవును. ఆ దేవత వల్లనే ఈ రో జిలా మనిషిలా ఉన్నాను".

అరవింద నవ్వి అంది. "ఆ దేవత ఎవరో కాదు కృష్ణా ... నేనే...."

ఆకాశం విరిగి మీద పడుతున్నట్టు ...... ఫెళ్లున ఉరుముతుంటే ... అయోమయంగా చూశాను.

అరవింద నా దగ్గరకొచ్చి నా భుజం మీద చెయ్యివేసి ఆత్మీయంగా నొక్కి అంది. "అవును కృష్ణా! ఆ వైశాలిని నేనే. అమ్మా నాన్నల మాట కాదనలేక నిన్ను కాదని శైలేంద్రను చేసుకున్నాను. నీ మనసు నాకు తెలుసు. ఎంత చిత్ర వధ అనుభవించావో తెలుసు. అందుకే అమెరికా వెళ్లి వైశాలి పేరుతో నేను ఉత్తరాలు రాయటం ప్రారంభించాను. నా జ్ఞాపకాలు తుడిచి వేసి నీలో సరికొత్త మనసును, స్పందనను ప్రవేశపెట్టాను. కృష్ణ పట్నంలో మా అక్క కూతు రుంది. దానికి నేను రాసిన ఉత్తరాలు పంపితే అది నీకు పోస్ట్ చేసేది. అలాగే నీ ఉత్తరాలు నాకు పంపించేది. ఫోటో పంపించమని చాలా సార్లు అడిగావు. ఎలా పంపించను? కానీ నేను ఆశించిన మార్పు నీలో వచ్చింది. ప్రేమంటేనే అసహ్యించుకుంటూ ఉత్తరాలు రాసే ... నిన్ను పెళ్లి గూర్చి ఆలోచింపచేయ గలిగాను."

మనసు మొద్దుబారి ఆలోచించే శక్తి కోల్పోయిన ట్లనిపిస్తోంది.

"క్షమించు కృష్ణా. నిన్ను నేను మోసం చేశాను. కానీ అది తప్పు కాదని నా ఉద్దేశం. నమ్మకం. నాకు తెలుసు. ఇవాళ నువ్వు ఎవరినైనా పెళ్లి చేసుకొని సుఖపడగలవన్న నమ్మకం నాకుంది. నీ మనసు పూర్తిగా అర్థంచేసుకున్న స్త్రీని ఈ ప్రపంచంలో నే నొక్కదాన్నే గనుక ఇంత నమ్మకంగా చెప్పగలుగుతున్నాను. తప్పకుండా ఈ నెలలో పెళ్లిచేసుకో. నీ పెళ్లికి నే నెక్కడున్నా వస్తా. ఒకే.. ఐ విష్ యు ఆల్ ద బెస్ట్.. గుడ్ నైట్ !"

అరవింద వెళ్లిపోయింది ... కాదు.....

వైశాలి వెళ్లిపోయింది... నిస్సత్తువగా సోఫాలో కూర్చున్నాను.

వర్షం వెలిసింది. ఖాళీ అయినా గ్లాసును చూసి బాటిల్ అందుకో బోయి చూశాను.

ఓల్డ్ మంక్ నన్ను చూసి నవ్వుతున్నాడు.....

గ్లాసు అందుకొని అనుకున్నాను -

"థాంక్యూ వైశాలి..... థాంక్యూ వెరీమచ్!!" ●